'ఆమె'కు అభివందనం


ఎల్‌బీనగర్‌కు చెందిన కార్టూనిస్టు ఎన్. రాము 'మహిళా మేలుకో అనే సందేశంతో గీసిన చిత్రం

తల్లిగా, ఆలిగా, చెల్లిగా.. ఇలా అనేక పాత్రలను నిజజీవితంలో పోషిస్తూ.. సృష్టికి ఆడదే ఆధారమని చాటుతోంది మహిళ. ఆకాశంలో సగమే కాదు, అవకాశాల్లోనూ సగం కోసం గళమెత్తి నినదిస్తోంది. తాను అబల కాదు సబల అని చాటి చెబుతోంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం దిల్‌సుఖ్‌నగర్, ఎల్‌బీనగర్ జోన్లలో పలు చోట్ల కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు స్కూళ్లు, కాలేజీలు, స్వచ్ఛంద సంస్థలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాయి. మహిళలను ఘనంగా సత్కరించారు. ఆసుపత్రుల్లో మహిళలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు.

–జోన్‌బృందం


కొత్తపేటలో కోటపాటి ఫౌండేషన్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వహించిన మహిళా దినోత్సవంలో ఎస్.ఆర్.ఆర్.చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ రామచంద్రరావు


జైపురి కాలనీ ప్రభుత్వ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వరలక్ష్మి


ఎల్‌బీనగర్ కామినేని హాస్పిటల్‌లో మహిళలకు ప్రత్యేక ప్యాకేజీని విడుదల చేస్తున్న వైద్యులు


దిల్‌సుఖ్‌నగర్ ఆద్య ఉమెన్స్ కాలేజ్‌లో జరిగిన సదస్సులో మాట్లాడుతున్న పీవోడబ్ల్యూ అధ్యక్షురాలు సరళ


మహిళా ఉన్నతికి కృషిచేస్తున్న స్మైల్ ఆల్వేస్ అధ్యక్షుడు సుధామనుడుని సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్

శాస్త్రీయ భావనలకు సైన్స్‌ఫెయిర్‌లు దోహదం


సిద్ధి వినాయక టాలెంట్ స్కూల్‌లోని సైన్స్ ఫెయిర్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: విద్యార్థుల్లో శాస్త్రీయ భావనలు పెరిగేందుకు సైన్స్‌ఫెయిర్‌లు దోహదపడతాయని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. నాగోలు డివిజన్ పరిధి సౌత్ ఎండ్ పార్కు కాలనీలోని శ్రీసిద్ధి వినాయక టాలెంట్ స్కూల్‌లో నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌ను ఎమ్మెల్యే శుక్రవారం పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీసేందుకు సైన్స్ ఫెయిర్‌లు సహాయపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ చింతల అరుణ, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు చింతల సురేందర్‌యాదవ్, చెరకు ప్రశాంత్‌గౌడ్, ప్రిన్సిపాల్ సువార్చన, కరస్పాండెంటట్ అభి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు

కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి

మన్సూరాబాద్: కాలనీలో నూతన సీసీ రోడ్ల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తెలిపారు. డివిజన్ హయత్‌నగర్ పరిధిలోని శివంహిల్స్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ పర్యటించి స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ పార్కు స్థలంలో ఓపెన్ జిమ్, పవర్ బోరును ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రోడ్ నెంబర్-4లో నూతనంగా డ్రైనేజీ పైప్‌లైన్ వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీ వాసులు శ్రీనివాస్‌గౌడ్, రామలింగంరెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఇంద్రారెడ్డి, రత్నాకర్‌రెడ్డి, గౌతమ్, నర్సిరెడ్డి, సత్యం రెడ్డి, మోహన్‌రెడ్డి, శ్యాసుందర్‌రెడ్డి, నాయకులు ఎల్లారెడ్డి, శ్రీధర్‌గౌడ్, సాయిరామ్‌గౌడ్, జయతేజ తదితరులు పాల్గొన్నారు.


శివం హిల్స్ కాలనీలో పర్యటించి సమస్యలను తెలుసుకుంటున్న కార్పొరేటర్ నర్సింహారెడ్డి

అనాథ విద్యార్థి గృహానికి విరాళం

50 వేల విలువైన సరుకుల అందజేత


అనాథ విద్యార్థి గృహంలో వస్తువులు అందజేసి మాట్లాడుతున్న రఘుకుమార్

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కే పురం చిత్ర లేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి తుర్కయంజాల్ కాలనీకి చెందిన రఘుకుమార్-విజయలక్ష్మి దంపతులు తమ కుమారుడు, కోడలు జగదీశ్వరసాయి కృష్ణ-నిఖిత పెళ్లిరోజు సందర్భంగా విరాళం అందజేశారు. శుక్రవారం రూ. 50 వేల విలువ గల సరుకులు, శానిటేషన్ వస్తువులు అందించారు. అనంతరం విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రఘుకుమార్‌కు గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు వరం

సీఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్సీ

నాగోలు: ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఒక వరం లాంటిదని ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్త అన్నారు. దిలుసుఖ్‌నగర్ భవానినగర్‌కు చెందిన బచ్చు రాజు బ్లడ్ కేన్సర్ సమస్యలతో హాస్పిటల్‌లో చేరాడు. దీంతో అతని కుటుంబ సభ్యులు ఎమ్మెల్సీని కలిశారు. వెంటనే స్పందించిన ఆయన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.3 లక్షలను మంజూరు చేయించారు. శుక్రవారం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్సీ అందజేశారు. కార్యక్రమంలో బొగ్గరపు శరత్‌చంద్ర పాల్గొన్నారు.

దశలవారీగా డివిజన్ అభివృద్ధి

ఎల్‌బీనగర్: డివిజన్‌లో దశలవారీగా మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని శ్రీపురం కాలనీ ఫేజ్ 2లోని పార్కు అభివృద్ధికి రూ.21 లక్షలు మంజూరు కావడంతో శుక్రవారం కాలనీవాసులతో కలసి పార్కును, కాలనీలో సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ పార్కును ఆహ్లాదంగా తీర్చిదిద్దడంతోపాటు పిల్లలు ఆటలాడుకునేందుకు పరికరాలు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ ఏఈ రాజ్‌కుమార్, శ్రీధర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సికిందర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, జంగయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

వనస్థలిపురం: అగ్ని ప్రమాదాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వారం వ్యవధిలోనే హయత్‌నగర్ పరిసర ప్రాంతాల్లో మూడు అగ్ని ప్రమాదాలు జరిగాయని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ద్వారకామయినగర్‌లో గురువారం రాత్రి గడ్డికి నిప్పంటుకుని ప్రమాదం జరగడంతో ఆ స్థలాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణకు అందరూ చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మధు, లక్ష్మణ్, శానిటేషన్ సిబ్బంది చంద్రశేఖర్, రామ్‌చందర్, మధు, శ్రవణ్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ సంబరాలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని గౌతమ్ మోడల్ స్కూల్‌లో శుక్రవారం గ్రాడ్యుయేషన్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన హైదరాబాద్ ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రామదాసు తేజావత్ మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలతో ఎక్కువ సమయాన్ని గడపాలని, అప్పుడే వారిలోని సృజనాత్మకత, సామాజిక బాధ్యతలు పెంపొందుతాయని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహ, అకాడమీ డీన్ శ్రీనివాస్, ప్రైమరీ ఇన్‌చార్జి రోహిణి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు అవకాశమివ్వాలి

చాదర్‌ఘాట్: తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ఇందిరా మహిళాశక్తి కోటి మంది మహిళలకు ఉపాధి పథకాల్లో 5 శాతం ప్రకారం 5 లక్షల మంది వికలాంగ మహిళలకు అవకాశాలు కల్పించాలని వికలాంగుల సంఘం నాయకుడు నల్గొండ శ్రీను కోరారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులతో కలిసి మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, కమిషనర్ శైలజలకు వారు శుక్రవారం వినతిపత్రాలు సమర్పించారు. కార్యక్రమంలో యశోద, వెంకట్, కిరణ్‌కుమార్, రాజేష్, షఫి, రమేష్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి అదృశ్యం


సాంబయ్య(ఫైల్)

హస్తినాపురం: ఇంట్లో నుంచి బయటికి వెళ్లిన మతిస్థిమితంలేని ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సంఘటనకు సంబంధించి వనస్థలిపురం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పోలీస్‌స్టేషన్ పరిధిలోని హిల్‌కాలనీలో నివాసం ఉంటున్న బల్గూరి సాంబయ్య(57) గురువారం ఉదయం పాల ప్యాకెట్ తీసుకువచ్చేందుకు నడుచుకుంటూ బయటికి వెళ్లిన సాంబయ్య తిరిగి ఇంటికి రాలేదు. సాంబయ్య ఆచూకీ కోసం బంధువులు, స్నేహితుల వద్ద ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో కుటుంబసభ్యులు యిచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రేమించిన యువతి దక్కలేదని...

నాగోలు: ప్రేమించిన యువతి దక్కలేదని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎల్‌బీనగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం మిరియాల గ్రామానికి చెందిన ఇరుగు రమేష్ కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి మాన్సురాబాద్‌లోని సాయిబాబా ఆలయం వద్ద అద్దెకు ఉంటున్నాడు. అతని చిన్న కుమారుడు విష్ణు(19) మాన్సూరాబాద్ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నాడు. గురువారం రమేష్ ఇతర కుటుంబ సభ్యులు బంధువుల ఇంట్లో జరిగిన ఓ కార్యక్రమానికి వెళ్లారు. గురువారం ఇంట్లోనే ఉన్న విష్ణు ఇంటి పైకప్పుపై ఉన్న ఇనుపరాడ్‌కు చీరతో ఉరేసుకున్నాడు. ఇంటి యజమాని గమనించి రమేష్‌కు ఫోన్ చేసి తెలియజేశాడు. రమేష్, కుటుంబసభ్యులు వచ్చి చూడగా విష్ణు అప్పటికే మృతి చెందాడు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ప్రేమించిన యువతి తనకు దక్కనందుకే విష్ణు ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. శుక్రవారం విష్ణు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు.

బస్సు ఫుట్‌బోర్డు పైనుంచి కిందపడి మహిళ మృతి

హస్తినాపురం: బస్సు ఫుట్‌బోర్డుపై నుంచి ప్రమాదవశాత్తు జారికింద పడటంతో బస్సు వెనుక చక్రాలు ఆమె పైనుంచి వెళ్లి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు... మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లెలగూడ డివిజన్ అంబేడ్కర్ నగర్‌కు చెందిన సోలిపేట దివ్య(25) బ్యూటీపార్లర్‌లో పనిచేస్తోంది. శుక్రవారం ఇంజాపూర్ బస్టాప్‌లో బస్సు ఎక్కింది. ప్రయాణికులు కిక్కిరిసి ఉండటంతో లోపలికి వెళలేక ఫుట్‌బోర్డుపై నిలబడాల్సి వచ్చింది. వీఎంఆర్ ఫంక్షన్ హాల్ దగ్గర ప్రమాదవశాత్తు ఫుట్‌బోర్డు పైనుంచి ఆమె జారి కిందపడిపోయింది. ఆమె వీపు మీది నుంచి బస్సు వెనుక చక్రాలు వెళ్లడంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే స్థానికులు వనస్థలిపురం ఏరియా ఆసుపత్రిలో తరలించగా వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

స్త్రీశక్తికి ప్రతీక 'శ్రీ శక్తి'

- ఓ చేత్తో ఇంటిపని.. మరో చేత్తో వృత్తి నిర్వహణ
- మహిళా ఆర్థిక స్వావలంబన.. చేతివృత్తులపై ఉపాధి పరిమళాలు
- శ్రీశక్తి మహిళా సంఘం 15 ఏళ్లుగా ఉచిత కుట్టుశిక్షణ
- అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం


స్కూల్ యూనిఫాంలు కుడుతున్న శ్రీ శక్తి డ్వాక్రా గ్రూప్ మహిళలు


కుట్టులో శిక్షణ పొందుతున్న మహిళలు

చంపాపేట: స్త్రీశక్తికి ప్రతీక శ్రీశక్తి.. స్త్రీ శక్తికి ఊతం శ్రీశక్తి.. స్త్రీ శక్తికి ప్రేరణ శ్రీశక్తి.. ఒకటి, రెండు కాదు 15 ఏళ్లుగా మహిళ ఆర్థిక స్వావలంబన, మహిళాసాధికారతకు కృషి చేస్తోంది శ్రీశక్తి మహిళా పొదుపు సంఘం. చేతివృత్తులను కాలక్షేపం కోసమో... హాబీగానో నేర్చుకుని మగవారికి ఏమాత్రం తీసిపోమని ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. ఇంటి పనిని ఓ చేత్తో.. శిక్షణ పొందిన వృత్తి పనిని మరో చేతితో నడిపిస్తూ పురుషులతో సమానంగా కుటుంబ పోషణలో భాగస్వాములు అవుతున్నారు శ్రీ శక్తి మహిళా పొదుపు సంఘం సభ్యులు. అంతర్జాతీయ మ హిళా దినోత్సవం సందర్భంగా ఆ సంఘంపై ప్రత్యేక కథనం...

చంపాపేట డివిజన్ నెహ్రూనగర్ కాలనీలో గత పదిహేను సంవత్సరాలుగా శ్రీ శక్తి డ్వాక్రా గ్రూప్ అధ్యక్షురాలు వరలక్ష్మి ఆధ్వర్యంలో లక్ష్మీనర్సింహ్మ ఫౌండేషన్ పేరిట గృహిణుల తీరిక సమయాలలో చేతి వృత్తులపై ఉచితంగా శిక్షణ ఇస్తూ అక్కడే వారికి ఉపాధి కల్పిస్తున్నారు. ప్రతీఏట సుమారు రెండు వందల మంది మహిళలు ఆడుతూ,పాడుతూ చేతి వృత్తులపై శిక్షణ పొందుతున్నారు. ఉదయం లేవగానే ఇంటిపని పూర్తిచేసి పిల్లలను బడికి, భర్తను కొలువుకు పంపి క్షణం తీరిక తీసుకోకుండా శిక్షణా కేంద్రానికి హడావిడిగా పరుగులు పెడుతున్నారు. మరి కొందరు టీనేజీ అమ్మాయిలు చదువుకుంటూనే చేతి వృత్తులపై శిక్షణ పొంది తల్లిదండ్రులపై ఆధార పడకుండా రవాణా, ట్యూషన్, పుస్తకాలు, ఇతర స్టేషనరీ ఖర్చుల కోసం సంపాదిస్తూ ఆర్థిక స్వావలంబన సాధిస్తున్నారు. కుట్టు మిషన్, చీరలపై పెయింటింగ్స్, ఎంబ్రాయిడరీ, ఫ్యాబ్రిక్, పాట్ డిజైనింగ్ వంటి చేతివృత్తులపై శిక్షణ పొంది నెలకు రూ.12 వేల నుంచి 20 వేల వరకు సంపాదించగలుగుతున్నారు.

శిక్షణ ఇస్తున్నాం.. ఉపాధి కల్పిస్తున్నాం



పదిహేను సంవత్సరాల క్రితం ఉచిత శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. శిక్షణ పొందిన మహిళలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉపాధి కూడా కల్పిస్తున్నాం. ప్రతీ ఏట మే నెల నుంచి మూడు నెలలపాటు విరామం లేకుండా స్కూల్ యూనిఫాంలు కుడుతున్నాం. అధికారులు యూనిఫాంలు కుట్టే బాధ్యత కొన్ని సొసైటీలకు అప్పగిస్తున్నారు. వారు మళ్లీ మాకే అప్పగించి కమిషన్ దండుకుంటున్నారు. ప్రభుత్వమే నేరుగా మాకు చేయూతనివ్వాలి. - వరలక్ష్మి, శ్రీ శక్తి డ్వాక్రా గ్రూప్ అధ్యక్షురాలు, చంపాపేట

ఉపాధికి మార్గమైంది



ఇంట్లో తీరిక సమయాల్లో ఖాళీగా కూర్చోవటం ఎందుకని కుట్టు మిషన్‌పై కుట్టు పని నేర్చుకున్నా. ముందుగా బ్లౌజ్‌లు, లంగాలు కుట్టేదాన్ని. అంతో ఇంతో ఆదాయం రావటంతో ఇదే వృత్తిగా చేపట్టా. రూ.12 వందల నుంచి 15 వందల వరకు సపాదిస్తున్నా. నాలో ఆత్మస్థైర్యం పెరిగింది.

– జయంతి, కటకోనికుంట

ప్రభుత్వం ప్రోత్సహించాలి



చేతివృత్తులపై శిక్షణ పొందిన వారిని ప్రభుత్వమే గుర్తించి వారందరినీ ఒకే వేదికపై తీసుకురావాలి. చేతివృత్తుల ఆధార కుటీర పరిశ్రమ ఏర్పాటు చేసి ప్రోత్సహిస్తే మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించి కుటుంబ పోషణలో భాగస్వాములవుతారు.

- శ్రీలత, చంపాపేట

వినూత్న ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలి

సైదాబాద్: విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టి వినూత్న సాంకేతిక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని జేఎన్‌టీయూహెచ్ యూజీసీ అఫైర్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ జయలక్ష్మి ఆకాంక్షించారు. శుక్రవారం ఐఎస్ సదన్ డివిజన్ వినయ్‌నగర్ కాలనీలోని భోజిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో జిజ్ఞాస-2025 పేరుతో రెండు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సాంకేతిక ఉత్సవాల ముగింపు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన 630 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు పలు సాంకేతిక అంశాల నమూనాలను ప్రదర్శించారు. ఉత్తమ ప్రదర్శన చేసిన విజేతలకు ఆమె, కళాశాల సెక్రటరీ ప్రొఫెసర్ సుధ ప్రశంసా పత్రాలు, పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల సీఓఓ డాక్టర్ సుజాత గంగాధర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ గ్రేసీ శైలజ, జె.మాధవన్, జి.దయాకర్‌రెడ్డి, కన్వీనర్ డాక్టర్ దీప్తి, ఆర్.మంజుభార్గవి పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ ఉమా రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శుక్రవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దేవాలయానికి వచ్చిన భక్తులకు పలు పరీక్షలు నిర్వహించారు. ఆయా రోగులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మరో రెండు రోజులపాటు ఈ వైద్యశిబిరం భక్తులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.